క్లుప్తంగా

పనిచేసే వారికి పార్టీలో గుర్తింపు



వైఎస్సార్‌సీపీ పట్టణ ఉపాధ్యక్షుడు, కార్యదర్శిని సత్కరిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: పనిచేసే వారికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో తగిన గుర్తింపు లభించిందని పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు కోటకొండ నరసింహుడు, ప్రధాన కార్యదర్శి కొరిశెట్టి విశ్వనాథ్ అన్నారు. పార్టీ పట్టణ కమిటీలో వారికి స్థానం లభించడం పట్ల పట్టణంలోని పార్టీ నాయకులు, వారి మిత్రులు సోమవారం శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు విశ్వనాథ్‌రమేష్, పాలశ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించండి

కౌతాళం: సకాలంలో పన్నులను చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని సర్పంచ్ పాల్‌దినకర్, కార్యదర్శి ప్రకాశం కోరారు. కౌతాళం మేజర్ పంచాయతీకి సంబంధించిన పన్నులను బకాయి ఉన్న ప్రతి ఒక్కరూ ఇంటి పన్ను, కుళాయి పన్ను, వ్యాపారం చేయువారు లైసెన్స్ ఫీజులను చెల్లించాలన్నారు.

నేడు ఐరన్‌బండలో దేవర

గోనెగండ్ల : మండల పరిధిలోని ఐరన్‌బండ గ్రామంలో మారెమ్మ, సుంకులమ్మ అవ్వ దేవర మహోత్సవం మంగళవారం నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు సోమవారం తెలిపారు. మంగళవారం తెల్లవారు జామున 3 గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు.

కల్యాణ మండపానికి విరాళం



నగదును అందజేస్తున్న రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సి.సావిత్రి

ఆదోని సెంట్రల్: పట్టణంలో రజక సంఘ ఆధ్వర్యంలో రాంజల ధోబీఘాట్ వద్ద నిర్మిస్తున్న మడివాల మాచయ్యస్వామి కల్యాణ మండపానికి రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సి.సావిత్రి రూ.1.09 లక్షలు విరాళంగా అందజేశారు. ఈ మేరకు సోమవారం రజక సంఘం నాయకులకు నగదును అందజేశారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు రామన్న, హుసేని, సతీష్, గోవిందప్ప, నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తుగా పన్నులు చెల్లించి రాయితీ పొందండి

ఆదోని టౌన్: ఆదోని పట్టణంలో ఆస్తి పన్ను మొత్తం ముందస్తుగా చెల్లించి 5 శాతం పన్ను రాయితీ పొందాలని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ వరకు ఆస్తి పన్ను చెల్లింపులో చెల్లింపుదారులకు రాయితీ వర్తిస్తుందన్నారు. డిమాండ్ నోటీసు అందకపోయినా ఇంటి నంబర్ లేదా అసెస్‌మెంట్ నంబర్‌తో కార్యాలయపు కౌంటర్‌లో గానీ, సమీప వార్డు సచివాలయంలోగానీ సంప్రదించాలని సూచించారు.

పార్టీని బలోపేతం చేయాలి

ఎమ్మిగనూరురూరల్: బీజేపీని గ్రామ స్థాయి నుంచి బలోపేతానికి ప్రతి కార్యకర్త పని చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు తోట రామకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక శ్రీ సుశీలమ్మ దేవాలయ కల్యాణ మండపంలో అసెంబ్లీ కన్వీనర్ తొగట నరసింహులు ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు చంద్రమౌళి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విట్టా రమేష్, జిల్లా ఇన్‌చార్జ్ అంకాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

ఆదోని రూరల్: నవోదయం 2.0లో భాగంగా నిర్వహించిన దాడులలో ఆదోని పట్టణంలోని బోయగేరికి చెందిన బోయ శివ అనే వ్యక్తి వద్ద నుంచి 20 లీటర్ల నాటుసారా, 40 కేజీల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సైదుల్లా సోమవారం తెలిపారు. బెల్లం అమ్మిన వ్యక్తి కుళ్లూరు గురురాజు (గురురాజా ట్రేడర్స్)పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

15న వాహనాల వేలం

ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ నేరాల్లో పట్టుబడిన వాహనాలకు ఈనెల 15న స్థానిక స్టేషన్ కాంపౌండ్‌లో వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ సైదుల్లా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు రూ.3 వేలు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

గెజిట్‌కు విరుద్ధంగా వసూళ్లు

ఎమ్మిగనూరుటౌన్:పట్టణంలోని మార్కెట్‌లో రోజువారీ గేటు వసూళ్లలో మున్సిపల్ గెజిట్‌కు విరుద్ధంగా వసూలు చేస్తున్నారని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు ప్రసాద్ ఆరోపించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. మార్కెట్‌లో గెజిట్ ప్రకారం తోపుడు బండికి రూ.20లు వసూలు చేయాల్సి వుండగా రూ.30లు వసూలు చేస్తున్నారన్నారని ఆరోపించారు. అక్రమ వసూళ్లు చేసే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాబ్బాషా, రహమతుల్లా, నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

మురుగు పారదు.. అవస్థ తీరదు!

- పలు కాలనీల్లో శిథిలమైన మురుగుకాలువలు
- రోడ్డు విస్తరణ పనుల్లో దెబ్బతిన్న వైనం
- చెత్తాచెదారం నిండి ముందుకు కదలని మురుగునీరు
- దుర్వాసనతో పాటు దోమల విజృంభణ
- నామమాత్రంగా పారిశుద్ధ్య పనులు, ఫాగింగ్

ఆదోని సెంట్రల్: పట్టణంలో మురుగు కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. పలు కాలనీల్లో కాలువలు శిథిలమయ్యాయి. చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి మురుగునీరు ముందుకు కదలక ఎక్కడికక్కడే నిలిచిపోయింది. దుర్వాసనతో పాటు దోమలు విజృంభిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు పూడికతీత, ఫాగింగ్ అప్పుడప్పుడు మొక్కుబడిగా చేస్తూ చేతులు దులుపుకుంటున్నారే తప్ప సక్రమంగా చేయడం లేదనే విమర్శలు వినబడుతున్నాయి.

ఆక్రమణల తొలగింపుతో దెబ్బతిన్న డ్రైనేజీలు

పట్టణంలో 42 వార్డులు ఉన్నాయి. దాదాపు 2లక్షలకు పైగా జనాభా ఉంది. రోజు రోజుకు పట్టణంలో ట్రాఫిక్ సమస్య పెరుగుతోంది. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అధికారులు రోడ్ల విస్తరణ పేరుతో పట్టణంలో ప్రధాన రహదారి, ఎమ్మిగనూరు రహదారి, ఎంఎం రహదారి, కొత్త బస్టాండ్ రహదారి వంటి పలు ప్రాంతాల్లో మురుగు కాలువలపై ఉన్న బంకులను, టీస్టాల్స్‌ను తొలగించారే తప్ప విస్తరణ పనులను మాత్రం చేపట్టలేదు. తొలగింపు సమయంలో మురుగు కాలువలు పలు చోట్ల అస్తవ్యస్తంగా మారాయి. మరి కొన్ని చోట్ల మట్టి పెళ్లలు, చిన్న చిన్న రాళ్లు, చెత్త చెదారం నిండి పోయి మురుగు నీరు, వర్షపు నీరు పోవడానికి వీలు లేకుండా అడ్డంగా ఉన్నాయి. ఆక్రమణలు తొలగించి నెల గడుస్తున్నా కాలువలను నిర్మించడం గానీ, మరమ్మతులు చేపట్టి యథావిధిగా మురుగు నీరు పోవడానికి చర్యలు చేపట్టలేదు.

రూ.లక్షల్లో ఆదాయం వస్తున్నా..

పట్టణంలోని ఎస్కేడీ కాలనీ, సాయిబాబానగర్, చందాసాబ్ దర్గా, ఎల్ఐజీ, ఎంఐజీ వంటి పలు కాలనీల పరిధిలో ఎక్కువగా ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు నివాసం ఉంటున్నారు. అయా వార్డుల నుంచి ఆస్తి, నీటి పన్నుల రూపంలో రూ.లక్షల్లో ఆదాయం వస్తుంది. అయితే సౌకర్యాలు మా త్రం అంతం మాత్రంగానే ఉన్నాయి. మురుగు కాలవలు లైనింగ్ దెబ్బతిని అస్తవ్యస్తంగా మారాయి. కాలువలను మొక్కుబడిగా అప్పుడప్పుడు శుభ్రం చేస్తూ చేతులు దులుపుకుంటున్నారే తప్ప సక్రమంగా చేయడం లేదనే విమర్శలు వినబడుతున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలతో కాలువలు నిండిపోయి మురుగునీరు ముందుకు పోవడం లేదు. శివారు కాలనీల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. అధికారులు స్పందించి మురుగు కాలువలకు మరమ్మతులు చేపట్టి, ఎప్పటికప్పుడు చెత్తచెదారాన్ని తొలగించి మురుగు నీరు సక్రమంగా వెళ్లేలా చర్యలు చేపట్టాలని అయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.



దుకాణాల వద్ద మురుగు కాలువపై బండలు పరిచిన దృశ్యం



ఎమ్మిగనూర్ సర్కిల్ వద్ద చెత్తచెదారంతో నిండి పోయిన మురుగు కాలువ

మరమ్మతులు చేయించుకుంటున్న ఇళ్ల యజమానులు

ఇంటి యజమానులు, షాపు యజమానులే తమ పరిధిలోని మురుగు కాలువలకు మరమ్మతులు చేపడితే మరికొంతమంది బండపరుపులు వంటివి వేసుకొని కాలం వెళ్లదీస్తున్నారు. వర్షం కురిసినప్పుడు మురుగు నీరు రోడ్డు మీదకు వచ్చి చేరుతుండటంతో వాహనదారులు, పాదచారులు రాక పోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఇప్పుడు మురుగు కాలువలు మట్టి పెళ్లలు, చెత్త చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండుకు పోవడంతో నీరు రోడ్డు మీదకు వస్తున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.

మురుగు కాలువల పనులు చేపడుతాం

మురుగు కాలువలు లేని ప్రాంతంలో కాలువలను నిర్మించేందుకు త్వరలో పనులను చేపడుతాం. ఈ పనులకు టెండర్లను కూడా పిలువనున్నారు. దెబ్బతిన్న మురుగు కాలువలను పరిశీలించి వాటి మరమ్మతులకు ప్రణాళికలను సిద్ధం చేస్తాం. నిధులు విడుదలయితే వాటి పనులను కూడా చేపట్టేందుకు చర్యలు తీసుకొంటాం. మురుగు కాలువలోని చెత్త చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగిస్తున్నాం. మురుగు నీరు ముందుకెళ్లాలంటే వ్యర్థ పదార్థాలు, ప్లాస్టిక్ వంటివి కాలువలో వేయరాదు. పట్టణ స్వచ్ఛతకు ప్రజలందరు సహకరించాలి.

-కే.కృష్ణ పురపాలక కమిషనర్, ఆదోని

హృదయంలోని అంధకారాన్ని తొలగించాలి



ప్రసంగిస్తున్న గోరంట్ల జ్వాన్నేష్

ఆదోనిసెంట్రల్: ప్రతి మనిషి హృదయంలోని అంధకారాన్ని తొలగించి వెలుగును నింపుకోవాలని అంతర్జాతీయ సువార్త ప్రసంగీకులు, కర్నూలు కేథలిక్ పీఠాధిపతులు డాక్టర్ ఘన గోరంట్ల జ్వాన్నేష్ అన్నారు. పట్టణంలోని మండిగిరి బాలయేసు చర్చిలో రెవరెండ్ ఫాదర్ కోలా విజయరాజు ఆధ్వర్యంలో తపస్సుకాల సువార్త సభను నిర్వహించారు. కార్యక్రమంలో గురువులు సురేష్, చిన్నప్ప, రవిచంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఎస్ఐగా నాగేంద్ర

కోసిగి: ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఎస్ఐగా కె.నాగేంద్ర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సోమవారం కోసిగి ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో సీఐ భార్గవ రెడ్డిని కలిసి ఆయన ఆర్డర్ కాపీని అందజేశారు. ఆళ్లగడ్డలో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తున్న ఆయన పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

కోసిగి: ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయాలతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ కొల్మాన్‌పేట యూనిట్ రాజమ్ అన్నారు. సోమవారం కోసిగి స్త్రీ శక్తి భవన కార్యాలయం ఆవరణలో కొల్మాన్‌పేట యూనిట్ ఆధ్వర్యంలో ప్రకృతి పద్ధతిలో పండించిన కూరగాయాల స్టాల్స్ ప్రదర్శన చేపట్టారు. రైతులు కిష్టప్ప, నాగరాజు, కృష్ణ, తాయన్న, భీమారెడ్డి పాల్గొన్నారు.

ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీ

ఆదోని టౌన్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం ఆదోని పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సత్యవతి, యూపీహెచ్‌సీ డాక్టర్లు అనిల్, వినోద్, మహేష్, టీబీ సిబ్బంది ఎంపీహెచ్ఎస్ బాబురాజు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. ర్యాలీని ప్రభుత్వ ఆసుపత్రి నుంచి భీమా సర్కిల్ వరకు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆదోని అర్బన్: ప్రతిఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఐఎంఏ అధ్యక్షుడు కృష్ణమూర్తి, కార్యదర్శి మధుసూదన్, సీనియర్ డాక్టర్లు రమామణి, గోపీనాథ్, కృష్ణదేవరాయలు, గంగాధర్‌రావు అన్నారు. స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌శాఖ ఆధ్వర్యంలో దేవీ నర్సింగ్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు.



ఆదోనిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కోసిగి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి వైద్యాధికారి మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో హెల్త్ సిబ్బంది, ఆశావర్కర్లు పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారిణి ఈశ్వరమ్మ, పీహెచ్ఎన్ కోటేశ్వరమ్మ, ఎంపీహెచ్ఈఓలు శ్రీనివాసులు, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

168 మందికి స్వర్ణామృతప్రాసనం పంపిణీ

ఆదోని అర్బన్: పట్టణంలోని అభయాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో సోమవారం ఆదోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్(అవోపా) వారి ఆధ్వర్యంలో 10వ విడతగా 168 మంది చిన్నారులకు స్వర్ణామృత ప్రాసనం మందును పంపిణీ చేశారు. దాత ఎస్ఆర్‌వి కాకుబాళ నాగేష్ ఆధ్వర్యంలో అవోపా ఆదోని పట్టణాధ్యక్షులు వంకదారు శ్రీనాథ్‌గుప్తా, అవోపా సభ్యులు చిన్నారులకు మందు వేశారు. కార్యక్రమంలో ఆదోని పట్టణ అవోపా కార్యదర్శులు రఘు, కోశాధికారి యాతగిరి వెంకటేశ్వర్లు, సభ్యులు రత్నయ్య, వెంకటేష్ బాబు, అవోపా మరియు వామ్ మహిళా విభాగం అధ్యక్ష కార్యదర్శులు వంకదారు మమతశ్రీ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



బాలుడికి మందు వేస్తున్న అవోపా పట్టణాధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్తా, అవోపా సభ్యులు

అన్నదానానికి విరాళం



దాతకు తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం వద్ద నిర్వహిస్తున్ని నిత్య అన్నదానానికి సోమవారం భక్తులు విరివిగా విరాళాలు అందజేసి తమ భక్తిని చాటుకున్నారు. జూలకల్ గ్రామ వాస్తవ్యులైన పెద్ద సోమన్న, మాణికమ్మ వారి కుటుంబ సభ్యులు రూ.51,116వేల నగదు రూపంలో అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు.

వన్యప్రాణి వేటగాడి అరెస్టు

కౌతాళం: పోలీస్‌స్టేషన్ పరిధిలో వన్యప్రాణి వేటగాడు పోలీసులకు పట్టుబడ్డాడు. సీఐ అశోక్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు గ్రామాల్లో గ్యాంబ్లింగ్ సమాచారం రావడంతో సిబ్బందితో మఫ్టీలో వెళ్తుండగా.. కాత్రికి-కుంబళనూరు గ్రామాల మధ్య అనుమానస్పదంగా ముగ్గురు ఎదురు కావడంతో వాహనం ఆపగా ఇద్దరు పరారు కాగా ఓ వ్యక్తి పట్టు పడ్డాడు. వీరు కర్ణాటక రాష్ట్రం శిరుగుప్ప నియోజకవర్గం కుడ్లూరు గ్రామానికి చెందిన జింకల వేటగాళ్లుగా గుర్తించామని చెప్పారు. పట్టుబడి వ్యక్తి పేరు బోయ తిమ్మప్ప అని, అతని వద్ద నుంచి ఒక బైకు, నాటు తుపాకీ, గన్‌పౌడర్, సుమారు 5కేజీల మాంసం స్వాధీనం చేసుకుని ఫారెస్టు డిపార్టుమెంట్ వారికి అప్పగించినట్లు తెలిపారు. మాంసం జింకదా లేక ఇతర జంతువులదా నిర్ధారణ కోసం ల్యాబ్‌కు పంపినట్లు కుప్పగల్ ఫారెస్ట్ ఆఫీసర్ సమీవుల్లా చెప్పారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ చేపట్టాలి

పెద్దకడబూరు : పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆదోని డివిజన్ చైర్మన్ రెవరెండ్ పాస్టర్ బి చిన్నబాబు డిమాండ్ చేశారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి నిరసనగా మంత్రాలయం నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్, క్రైస్తవుల కమిటీ పెద్దకడబూరు మండల ఎంపీపీ అధ్యక్షుడు, సీఎస్ఐ సంఘం కాపరి రెవరెండ్ ముత్తు మనోహర్ ఆధ్వర్యంలో సోమవారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్ గీతాప్రియదర్శినికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో పాస్టర్లు సంజీవకుమార్, దావీదు, ప్రకాష్, జయపాల్, ఇమ్మానియేలు తదితరులు పాల్గొన్నారు.

శారీ సెంటర్‌లో చోరీ

ఆదోని అర్బన్: పట్టణంలోని గీతా మార్కెట్‌లో ఉన్న డైమండ్ శారీ సెంటర్‌లో 25 చీరలు చోరీకి గురైనట్లు షాపు యజమాని ఇలియాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. గత నెల 25వ తేదీన రూ.90 వేలు విలువచేసే చీరలు దొంగలించారని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

బాలికల అదృశ్యం

ఆదోని అర్బన్: పట్టణంలోని మాసా మసీదు కాలనీలో నివాసముంటున్న ఇద్దరు బాలికలు అదృశ్యమయ్యారని వన్‌టౌన్ పోలీసులు సోమవారం తెలిపారు. ఈనెల 5వ తేదీన ఇంటి నుంచి చికెన్ తీసుకురావడానికని వెళ్లి తిరిగి రాకపోవడంతో బాలికల తల్లిదండ్రులు బంధువుల ఇళ్లల్లో వెతికినా కూడా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులను ఆశ్రయించారని తెలిపారు.

రమణీయం.. రథోత్సవం

పెద్దకడబూరు : మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామంలో వెలసిన సీతారామాంజినేయ స్వాముల రథోత్సవం సోమవారం రమణీయంగా సాగింది. ఉదయం ఆలయ అర్చకులు స్వామివారికి కుంకుమార్చన, అష్టోత్తర శతనామావళి, పుష్పాభిషేకం, పాలాభిషేకం, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించి మహా మంగళహారతులు చేపట్టారు. అనంతరం గ్రామ ప్రజలు పిండి వంటలతో స్వామివారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ముందుగా రథోత్సవం ముందు శాంతి హోమం చేపట్టారు. కిందిగేరి వేమారెడ్డి ఇంటి నుంచి కలశం, పైగేరి ఓంకారప్ప ఇంటి నుంచి కుంభాన్ని ఊరేగింపుగా రథం దగ్గరికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అశేష భక్తుల నడుమ సాగుతున్న రథోత్సవం

అనంతరం ఉత్సవ మూర్తులను రథంపై ఆశీనులు గావించి అశేష భక్త జనుల మధ్య శ్రీరామ నామస్మరణతో ముందుకులాగారు. రథాన్ని బసవన్న గుడి కట్టవరకు లాగి యథాస్థానానికి చేర్చారు. ఎస్ఐ నిరంజన్‌రెడ్డి బందోబస్తు నిర్వహించారు.

బాలికల కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం మొదటి సంవత్సర అడ్మిషన్లను కళాశాల ప్రిన్సిపాల్ విజయరాణి ప్రారంభించారు. ఈమేరకు పలువురు విద్యార్థినులకు అడ్మిషన్లు ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ.. ఇప్పటికే ద్వితీయ సంవత్సర విద్యార్థినులకు తరగతులు ప్రారంభించామన్నారు. వారికి పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. తమ కళాశాలలో సీఈసీ, హెచ్ఈసీ, ఎంఈసీ, ఎంబైపీసీ కోర్సులు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలలో ఉన్నాయన్నారు. అదేవిధంగా ఉర్దూ మీడియం హెచ్ఈసీ గ్రూప్ కూడా వుందని చెప్పారు. నామమాత్రపు ఫీజులతో అడ్మిషన్లు ఇస్తున్నామని, అనుభవజ్ఞులైన అధ్యాపకులు కళాశాలలో బోధిస్తున్నారన్నారు. తమ కళాశాలలో చదివిన విద్యార్థినులు మంచి ఫలితాలు సాధిస్తున్నారని, అదేవిధంగా జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్ నీట్, ఎంసెంట్ లాంటి పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

ఆర్టీసీ బస్టాండులో బైకు చోరీ

ఆదోని టౌన్: ఆదోని ఆర్టీసీ బస్టాండులో బైకు చోరీకి గురైంది. రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి బి.లక్ష్మన్న సోమవారం ఉదయం 10 గంటల సమయంలో పనిని మిత్తం డీఎం ఛాంబర్‌కు వచ్చాడు. కార్యాలయంలో పని ముగించుకుని బయటికి వచ్చాడు. అంతలోనే ఏపీ21ఏఎస్9600 నంబర్ గల స్ప్లెండర్ ప్లస్ బైకును గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. బైకు కనిపించకపోవడంతో లక్ష్మన్న ఆందోళనకరంగా స్థానికులు, వ్యాపారులను ఆరా తీశాడు. సీసీ కెమెరాలను పరిశీలించాడు. అయితే అందులో గుర్తు తెలియని వ్యక్తి బైకును తీసుకెళ్తున్న దృశ్యం కనిపించింది. ఈ విషయంపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు విలేకరులకు తెలిపాడు. ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులకు రక్షణ లేకుండా పోతోందని, ఇటీవల సెల్‌ఫోన్‌లు, మహిళల గొంతుల్లోని బంగారు ఆభరణాలు చోరీకి గురవుతున్నాయని పట్టణ ప్రజలు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ బస్టాండులో భద్రతా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అంటరానితనంపై పోలీసుల వైఖరి తేల్చాలి

ఆదోని రూరల్: అంటరానితనంపై పోలీసుల వైఖరి ఏమిటో తేల్చాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు నల్లప్ప డిమాండ్ చేశారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా మండలంలోని సంతెకూడ్లూరు గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అయితే పోలీసులు వచ్చి ఇందుకు పర్మిషన్ తీసుకోవాలంటూ అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకరోజు ముందు వెళ్లి పర్మిషన్ అడిగినప్పుడు ఇవ్వని పోలీసులు, ఆధిపత్య వర్గాలు చెప్పిన మాటలు విని క్రికెట్ టోర్నమెంట్‌ను అడ్డుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు తిక్కప్ప, జీవరత్న, కోసిగి ఈరన్న, లాజరు, రాము తదితరులు పాల్గొన్నారు.

మాకేంటి సంబంధం!

ఆదోని రూరల్: ఆదోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన కార్యక్రమానికి సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ హాజరై డివిజన్ పరిధిలోని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, సమస్యలను ఎంతో శ్రద్ధగా విని వాటికి పరిష్కారమార్గం చూపేవిధంగా చర్యలు తీసుకుంటున్నారు. అయితే డివిజన్ స్థాయి ఆయాశాఖల అధికారులు మాత్రం అంతా ఆయనే చూసుకుంటారు, తమకేమి సంబంధం లేదన్నవిధంగా కొంతమంది నిద్రలోకి జారుకోవడం, మరికొంతమంది సెల్‌ఫోన్‌లు చూస్తూ, ఇంకొంతమంది పక్కన అధికారులతో బాతాఖానీ కొడుతూ కాలక్షేపం చేస్తున్నారు. వారి తీరుపట్ల సమస్యలు చెప్పుకోవడానికి వచ్చిన ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు పెదవి విరుస్తున్నారు. గతంలో అధికారులు తీరు మార్చుకోవాలని సబ్‌కలెక్టర్ మొట్టికాయలు వేసినా అధికారుల తీరులో మార్పు రావడం లేదు.



సబ్‌కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తుండగా, ఎవరి పనిలో వారు నిమగ్నమైన అధికారులు

కనుల పండువగా మల్లికార్జున స్వామి రథోత్సవం



అశేష జనవాహిని మధ్య స్వామి వారి రథోత్సవం

కౌతాళం : మండల పరిధిలోని బదినేహాల్ గ్రామంలో వెలసిన మల్లికార్జున స్వామి జాతర మహోత్సవం సోమవారం కనుల పండువగా సాగింది. ఆనవాయితీ ప్రకారం గ్రామానికి చెందిన తమ్మిరెడ్డి వంశీయుల కుటుంబం నుంచి మొదటి కుంభం దేవాలయానికి చేరి రథానికి పూజలు చేసిన అనంతరం గ్రామస్తులు రథాన్ని ముందుకు సాగనంపారు. రథోత్సవంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు వీరభద్రగౌడ్, నకేష్‌రెడ్డి, ఉప సర్పంచ్ ప్రసన్న గౌడ్ పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న ప్రదీప్‌రెడ్డి

హామీలు నెరవేర్చకుండా కాలయాపన

కౌతాళం: కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నేరవెర్చకుండా కాలయాపన చేస్తున్నాయని అఖిల భారతరైతు కూ లీ సంఘం మండల అధ్యక్షుడు నాగేంద్రప్ప, ప్రధా న కార్యదర్శి జగదీష్ అన్నారు. సమస్యలపై స్పందించాలని కోరుతూ సోమవారం స్థానిక తహసీల్దా రు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దారు రజనీ కాంత్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ఖాదర్‌బాషా, గోపాల్ గాదిలింగ, శ్రీను, వీరేష్, లింగప్ప, అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ఆఖరి మజిలీకి తప్పని కష్టాలు

కోసిగి: మండల కేంద్రంలో ఆఖరి మజిలీకి కూడా కష్టాలతోనే శ్మశానికి వెళ్లాల్సిన దుస్థితి ఉంది. కోసిగి సిద్దప్ప పాళెం ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న పులి ముక్రయ్య (30) ఆదివారం కౌతాళం మండలం బదినేహాల్ గ్రామ సమీపంలో ఎల్లెల్సీ కాల్వ ప్రమాదశాత్తు పడిపోయి మృతి చెందిన విషయం విధితమే. సోమవారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. సజ్జలగుడ్డం రోడ్డులో శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. అయితే శ్మశానానికి వెళ్లేందుకు సరైన రహదారి లేకపోవడంతో మృతదేహాన్ని భుజాలపై ఎత్తుకొని రైలు పట్టాలు దాటుకుంటూ అష్టకష్టాలు పడుతూ తీసుకెళ్లాల్సి వచ్చింది. గ్రామంలో పలు కాలనీల్లో నివాసముంటున్న వారు ఎవరు చనిపోయినా ఈ మార్గంలోనే శ్మశానికి తీసుకెళ్లాలి. పట్టాలు దాటే సమయంలో రైలు వస్తే అది వెళ్లిపోయేంతవరకు శవాన్ని మోసుకుని వేచి ఉండాల్సి వస్తోంది. గతంలో రైలు పట్టాలు కింద నడిచి పోయే విధంగా అండర్‌పాస్ ఏర్పాటు చేశారు. అయితే గ్రామంలోని డ్రైనేజీ నీళ్లు అందులో ప్రవహిస్తుండడంతో నడిచి వెళ్లేందుకు వీలు లేకుండా తయారైంది. దీంతో చేసేది ఏమి లేక పట్టాలు దాటుతూ వెళ్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చనిపోయిన వారిని ప్రశాంతంగా శ్మశానానికి తీసుకెళ్లేందుకు రైలు పట్టాలు దాటే సమస్యను తొలగించాలని ఆయా కాలనీ వాసులు కోరుతున్నారు.



కష్టాలు పడుతూ మృతదేహాన్ని మోసుకుని రైలు పట్టాలు దాటుతున్న గ్రామస్తులు

సేవా పురస్కారాలు



మంత్రి, ఎంపీ, కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న కరణం లీలారాణి

నందవరం : ఉగాది పండుగ సందర్భంగా శ్రీశైలానికి వెళ్లే కన్నడ భక్తులకు, పాదయాత్ర భక్తులకు మండలంలో పోనకలదిన్నె గ్రామంలో అన్నదానం, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి సేవలు అందించిన వారికి సేవ పురస్కారాలు లభించాయి. మండలంలో ఏడుగురు సేవా పురస్కారాలకు ఎంపికయ్యారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, ఎంపీ నాగరాజుల చేతుల మీదుగా నాగలదిన్నె గ్రామానికి చెందిన మహమ్మద్ షఫీ, సోమలగూడూరు గ్రామానికి చెందిన శ్రీధర్ స్వామి, కాపు గిడ్డారెడ్డి, కరణం శివగణేష్, కరణం లీలారాణి, పోనకలదిన్నె గ్రామానికి చెందిన ఆర్. కోదండరామిరెడ్డి, చాకలి చంద్రన్న అవార్డులు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు.